క్లుప్తంగా

ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించాలి

రాజవొమ్మంగి: రంపచోడవరం ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించాలని రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపేందుకు ఈ సమావేశం ఒక చక్కని వేదిక అన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా జరుగుతున్న పథకాలు, పలు కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి తెలియాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జరుగాల్సిన ఈ సమావేశాన్ని సంబంధిత అధికారులు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

గూడెంకొత్తవీధి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని ఏబులం, దుచ్చరిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశా రు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులందరికీ ఆధార్ అప్‌డేట్ చేయించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలన పరిశీలించారు. కిచెన్‌గార్డెన్ నిర్వహించేందుకు వీలుగా రక్షణ గోడల నిర్మాణం చేపట్టేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో సువర్ణమ్మ తదితరులు

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం సీడీపీవో సువర్ణమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంఈవో బాబూరావు పడాల్, ఎంపీడీవో వీరభద్రరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కిశోరి వికాసం 11–18 సంవత్సరాల బాలికలకు సంపూర్ణ ఆహారం, నాణ్యమైన విద్య, రుతు పరిశుభ్రత, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, నైపుణ్యం,ఉపాధి తదితర అంశాలపై వారు అవగాహన కల్పించారు. కిశోర బాలికలు తప్పనిసరిగా ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనారోగ్యమైతే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం, హెచ్‌వీ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులతో కిటకిటలాడిన గిరిజన మ్యూజియం



గిరిజన మ్యూజియం వద్ద పర్యాటకులు

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో పర్యాటకుల తాకిడి పెరిగింది. ఏడాది చివరి వారం కావడంతో తెలుగు రాష్ట్రాలు ఆంధ్ర, తెలంగాణతో పాటు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక మొత్తంలో తరలివచ్చారు. దీంతో సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. దీంతో గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. గత శుక్రవారం నుంచి సోమవారం వరకు గిరిజన మ్యూజియంనకు రూ.13.70లక్షల ఆదాయం సమకూరగా, పద్మాపురం ఉద్యానవనానికి రూ.5.56 లక్షల ఆదాయం సమకూరినట్టు మేనేజర్లు మణికుమార్, బోమజుబాబు తెలిపారు. రానున్న రోజుల్లో మరింతగా పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

రంపచోడవరం: మండలంలో 19 పంచాయతీల పరిధిలో పింఛన్‌దారులకు ఈనెల 31న పింఛన్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో శ్రీనివాసుదొర తెలిపారు. సుమారు 4,516 మంది పింఛన్‌దారులున్నట్టు పేర్కొన్నారు.

గ్రామాల్లో అధ్వానంగా రహదారులు

పెరుగుతున్న ప్రమాదాలు

పట్టించుకోని అధికారులు



దారుణ దారులు

జీకే వీధిలోని గోతుల రహదారిపై ఆర్టీసీ బస్సు రాకపోకలు

కొయ్యూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మన్యంలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో కూడా ఒక్క పని చేసిన దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన్య ప్రాంతాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి గ్రామానికి రహదారి, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఏజెన్సీలో అన్ని ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో మంజూరైన నిధులు ఎన్నికల కోడ్ వల్ల పనులకు ఆటంకం కలిగింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవు. ఆరు నెలలు పైబడినా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రస్తుత కూటమి సర్కారు ఏజెన్సీలో ఒక్క పని చేసిన దాఖలాలు లేవు. దీంతో మన్యంలో అభివృద్ధి కుంటుపడింది. రాళ్లు తేలిన రహదారులు, చిత్తడి దారులతో గిరిజనుల రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర సేవలు 108, 104 అందక ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించి గిరిజన గ్రామాల్లో రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అమలు కాని హామీలు ..మొదలుకాని పనులు

గూడెంకొత్తవీధి: ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రం నుంచి జిల్లా మీదుగా తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌గడ్ వంటి రాష్ట్రాలను కలుపుతూ వెళ్తున్న అంతర్రాష్ట్ర రహదారి దుస్థితి గతకొంతకాలంగా దయనీయంగా మారింది.నిత్యం రద్దీగా ఉండే ఈమార్గం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. అడుగుకో గొయ్యిగా దర్శనమిస్తోంది. గడిచిన రెండు నెలల్లో వచ్చిన తుపానుల కారణంగా ఈ మార్గంలో కొన్ని చోట్ల పెద్ద పెద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. రహదారి బాగా దెబ్బతింది. కల్వర్టులు, వంతెనలు కుంగిపోయాయి. ఈ కారణంగా ఈ మార్గంలో చాలా రోజుల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతర్రాష్ట్ర రహదారి సమస్యపై గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళనలు, కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఇతర ఉన్నతాధికారులకు వినతులు అందజేశారు. ప్రధానంగా గూడెంకొత్తవీధి నుంచి సప్పర్ల వరకూ ప్రధాన రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. రహదారులు బాగోకపోవడంతో ఈ మార్గంలో నడిచే విశాఖ– భద్రాచలం, విశాఖ –సీలేరు వంటి దూర ప్రాంత సర్వీసులు, నైట్ హాల్టు సర్వీసులను ఆర్టీసీ రద్దు చేసింది. అసలే ఈ మార్గంలో తిరిగే ఒకటి, రెండు దూరప్రాంత సర్వీసు బస్సులను సైతం అధికారులు రద్దుచేయడంతో ఈ ప్రాంతంలో అత్యవసర సమయాల్లో రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు. అధిక వ్యయాన్ని వెచ్చించి ప్రయివేటు వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తోంది.

గోతులమయం

మండలంలోని గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. వై.ఎస్.పాకల నుంచి నల్లగొండకు వెళ్లే నాలుగు కిలోమీటర్ల రహదారి నరకాన్ని తలపిస్తుంది. ద్విచక్రవాహనాంపై కూడా వెళ్లలేని పరిస్థితి. గతంలో ఇక్కడ బీటీ రహదారి ఉండేది. ఇది పూర్తిగా పాడైపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీని మూలంగా ఈ గ్రామాలకు రావాలంటే అవస్థలు పడుతున్నారు. ఇక మారుమూల ప్రాంతమైన యూ.చీడిపాలెంకు వెళ్లే రహదారి కూడా దారుణంగా ఉంది. అడ్డతీగల మండలం వెదుపవల్లి నుంచి అయిదు కిలోమీటర్ల దూరంలో యూ.చీడిపాలెం ఉంది. అక్కడ నుంచి కూడా రహదారి పూర్తిగా పాడైంది. వీరవరం నుంచి గొట్లుపాడు వరకు రహదారి పూర్తిగా పాడైంది. ఇక్కడ సీసీ వేయకపోవడంతో రోడ్డు వేసిన వెంటనే పాడైపోతున్నాయి. వర్షాకాలం వస్తే ఈ ప్రాంతానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి.దీనిపై ఏఈ రామకృష్ణను సంప్రదిస్తే కొత్త రోడ్లకు ప్రతిపాదిస్తున్నామన్నారు



యూ.చీడిపాలెం రహదారి దుస్థితి

సంక్రాంతి లోగా పనులు పూర్తయ్యేనా?



సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లను నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ పరిస్థితి చూస్తే గోతులమయమైన రహదారి కనీసం పూడ్చే పనులేవీ చేయడం లేదు. ఈ విషయంపై అధికారులను సంప్రదిస్తే నిధులను విడుదల య్యాయని టెండర్లు పిలిచి పనులను పూర్తి చేస్తామంటున్నారు.పూర్తిగా గోతులమయమైన రహదారుల్లో కనీసం తాత్కాలికంగా అయినా మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరుతున్నాం.

–కిముడు శివరత్నం,
జెడ్పీటీసీ సభ్యురాలు, గూడెంకొత్తవీధి

ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ పోటీలకు గిరిజన విద్యార్థులు



పి.రమేష్



వి.మహేష్

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాల నుంచి ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం బీఏ చదువుతున్న పి.రమేష్, వి.మహేష్‌లు ఈ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. బట్లండా పంజాబ్‌లో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకూ జరగనున్న పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పిడి శివరాంతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

గ్రామాల్లో వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సాధన

హుకుంపేట: టీబీ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తగా గిరిజనులు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.సాధన చెప్పారు. మండలంలోని కొంతిలి పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన టీబీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గిరిజనులకు టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజనులు టీబి వ్యాధి రాకుండా ముందుగా జాగ్రత్తలు పడాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. పర్యవేక్షకులు కె.సదానందం, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ ఎం.ధనరాజు, సిబ్బంది విజయలక్ష్మి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు



ఐటీఐలో రికార్డులు తనిఖీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ టౌన్: మండలం కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, లక్ష్యంతో చదవితే ఉత్తమ ఫలితాలు పొంది, ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తరగతి గదులను సందర్శించారు. ఐటీఐలో నెలకొన్న సమస్యలను విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఐటీఐలో మరుగుదొడ్లు, సాన్నపుగదులు, సీసీ రోడ్డు వంటి సమస్యలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న స్టాఫ్‌కు కాంట్రాక్టు ఉద్యోగుల అవకాశం కల్పించేలా ప్రభుత్వం దృష్టిలో తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వాబి రామ్మూర్తి తదితరులున్నారు.

పంట బీమా నమోదు చేసుకోవాలి



రాజ్‌మా పంటను తూనిక వేస్తున్న ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి: మండలంలో గిరిజన రైతులు ఈ ఏడాది అల్పపీడన ప్రభావంతో రాజ్‌మా పంట నష్టపోయారని, బీమా సౌకర్యం ద్వారా నష్ట పరిహారాన్ని పొందాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. పెదబరడ పంచాయతీ పరిధిలోని బి.డి.పాకలు గ్రామంలో రాజ్‌మా పంట 5 మీటర్లు పొడవు, 5 మీటర్లు వెడల్పులో వేసిన పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కోతలో 305 గ్రాములు దిగుబడి మాత్రమే వచ్చినట్టు తేలిందన్నారు.పూత సమయంలో అల్పపీడన ప్రభావంతో పూత పిందె రాలిపోయి తక్కువ దిగుబడులు నమోదైనట్టు రైతులకు వివరించారు. రాజ్‌మా పంటకు సంబంధించి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ప్రకటించిందన్నారు. ఈ నష్ట పరిహారం పొందడానికి మంగళవారమే చివరి తేదీ కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు బీమా సౌకర్యం పొందేలా నమోదు చేసుకోవాలని ఏఓ కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



అరకు సీఐ హిమగిరి



ఎటపాక సీఐ కన్నపరాజు



చింతపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

అరకులోయటౌన్: అరకులోయ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో డిసెంబర్ 31 రాత్రి న్యూ ఇయర్ వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ హిమగిరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా, మద్యం సేవించి రోడ్లపై స్పీడ్ డ్రైవింగ్ చేసినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. హోటళ్లు, లాడ్జీలు, రిసార్ట్‌ల నిర్వాహకులు పోలీసుశాఖ అనుమతులు లేకుండా డీజే సౌండ్స్, ఫైర్ క్యాంపులు నిర్వహించినా, పోలీసుశాఖ హెచ్చరికలు భేఖాతరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులు, స్థానికులు పోలీసుశాఖకు సహకరించాలని ఆయన కోరారు.

ఎటపాక: న్యూ ఇయర్ వేడుకల సాకుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎటపాక కన్నపరాజు సోమవారం హెచ్చరించారు. వేడుకలను నిర్ధేశించిన రాత్రి 1 గంట సమయం వరకు మాత్రమే జరుపుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వాహనాల సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారులపై సౌండ్‌సిస్టంలు ఏర్పాటుచేసి వేడుకలు జరుపుకునేందుకు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజాజీవనానికి ఆటంకం కలుగకుండా గ్రామాల్లో వేడుకలు జరపాలని తెలిపారు. రాత్రి సమయంలో ప్రతీ గ్రామంలో పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు.

చింతపల్లి: మండలంలో పోలీసులు శాఖ అనుమతులు లేకుండా డిసెంబర్ 31 రాత్రి న్యూ ఇయర్ ఉత్సవాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా డిసెంబర్ 31 సందర్భంగా పబ్లిక్ ప్రాంతాల్లో డీజె సౌండ్లు, అశ్లీల నృత్యాలు సామాన్యులకు ఇబ్బంది కల్గించే ఎటువంటి కార్యక్రమాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముఖ్యంగా లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో రిసార్టుల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డిసెంబర్ 31 రాత్రి సమయంలో రోడ్లపై విచ్చలవిడిగా గుంపులుగా తిరగొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వేడుకలు జరుపుకునేందుకు ముందుగా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు.

అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్



ముంచంగిపుట్టులో అమిత్‌షాకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న సీపీఎం నేతలు



దుంబ్రిగుడలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ముంచంగిపుట్టు: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనను సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటంతో ప్లకార్డులు పట్టుకొని మండల కేంద్రంలో పార్టీ నేతలు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో నిరసన కార్యక్రమం చేశారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి త్రినాథ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్‌షా దారుణంగా మాట్లాడంపై పార్టీ ఖండిస్తుందని, కేంద్ర హోంమంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రధాని మోదీ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. నేతలు గాసిరాందొర, శ్రీను, లైకోన్, నారాయణ, రామదాసు, శంకర్‌రావు, ఈశ్వరి, ధనుర్జయ్ తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. సీపీఎం కేంద్రం కమిటీ పిలుపు మేరకు రాస్తారోకోను చేపట్టి అమిత్‌షా రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. పార్టీ మండల కార్యదర్శ ఎస్.బి పోతురాజు మాట్లాడుతూ కేంద్రమంత్రి పదవిలో ఉండి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని, పదవి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సూర్యనారాయణ, మహేశ్, సురేష్‌కుమార్, సత్యనారాయణ, డొంబు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టేకులబోరులో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అమిత్‌షా హోంమంత్రి కాగలిగారన్నారు. అలాంటి మహనీయున్ని అవమాన రుస్తూ , దళితులను కించపరిచేలా మాట్లాడటం సరైంది కాదని, తక్షణమే హోం శాఖ మంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి బొర్రయ్య, సర్పంచ్ నాగమణి, సీతారామయ్య, శంకర్, రామారావు, నాగరాజు, శ్రీనివాసరావు, షణ్ముఖరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో హోం శాఖామంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్డు జంక్షన్‌లో రాస్తారోకో నిరసన కార్యక్రమం చేశారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శ కిండంగి రామారావు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన పదవి హోం శాఖా మంత్రి అంబేడ్కర్‌పై చేసిని అనుచిత వ్యాఖ్యలు దేశ బడుగు, బలహీన వర్గాల మనోభావాలను దెబ్బతిస్తుందన్నారు. నాయకులు ఉమామహేశ్వరరావు, బాలదేవ్, బుజ్జిబాబు. మగ్గన్న, రామన్న, హరి, బాలకృష్ణ, కోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖామంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం, సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాడేరు అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు రాధాకృష్ణ, సుందర్‌రావులు మాట్లాడుతూ ఉన్నత పదవులో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షారాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై ఎగతాళి చేసి అవమానంగా వ్యాఖ్యలు చేయాడం దురదృష్టకరమన్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు చేస్తున్నా ప్రధాని మోదీ అమిత్‌షాని వెనకేసుకుని వస్తుండటం సిగ్గు మాలిన చర్య అన్నారు. తక్షణం కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు లక్కు, చిన్నారావు, దాష్, రాజు, సూరిబాబు, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: పార్లమెంట్ సాక్షిగా నిండు సభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం తోటపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కాక అర్జున్ దొర మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం రూపకల్పిన చేసిన మహనీయుడు అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు పార్లమెంట్‌లో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. శ్రీనివాస్, ప్రసాద్, అప్పారావు తదితరులున్నారు. చింతూరులో అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేశారు. నాయకులు వెంకట్, సురేష్, లక్ష్మణ్, రాజయ్య, రాజ్‌కుమార్, రంగమ్మ, సుబ్బారావు తదితరులున్నారు.



టేకులబోరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



అరకులోయలో రాస్తారోకో చేస్తున్న నేతలు



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



తోటపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు

వై.రామవరం: మండలంలోని కె.యర్రగొండ గ్రామానికి చెందిన కుంజం నాగేశ్వరరావు (32) అనే వ్యక్తి సోమవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇంట్లో గొడవపడి మందు తాగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీకు తరలించగా సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. ఎస్‌ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంఎల్‌సీ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదివాసీల హక్కులపై అవగాహన అవసరం



జి.మాడుగులలోని సదస్సులో ఆదివాసీ సంఘం నాయకులు

జి.మాడుగుల: ఆదివాసీ స్వయం పాలనపై చైతన్యం కావాలని ఆదివాసీ దండకారణ్య రాష్ట్ర హక్కుల సంఘం అడ్వకేట్ వేదాంగి చిట్టిబాబు, కేంద్ర కమిటీ ప్రతినిధి(డిఎల్‌వో) ఎస్.మాణిక్యం, రాష్ట్ర అధ్యక్షుడు కోడా ఆనంద్ తెలిపారు. ముందుగా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక రామలయ అవరణలో ఆదివాసీ స్వయం పాలన చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలు గిరిజన చట్టాలు, హక్కులు, ఐదో షెడ్యూల్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పీసా చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. 1/70 భూ బదిలీ నియంత్రణ చట్టం అమలు చేయాలని, ఏజెన్సీ ముఖద్వారాల్లో 5వ షెడ్యూల్ ప్రాంత వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఖనిజాలు, ఇతరత్రా సంపద ప్రథమభాగం గ్రామ పంచాయతీలకే దక్కాలన్నారు. మండలంలో ఉరుము, కంబాలబయలులోని నల్లరాయి క్వారీల నుంచి పంచాయతీలకు రాయితీలు విడుదల చేయాలని, లేదా క్వారీల లీజును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సభ్యులు ఆనందరావు, కాంతారావు, కేశవరావు, చిట్టిబాబు, సిర్దాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు

సీలేరు: జి.కె.వీధి మండలం దారకొండ సచివాలయంలో సోమవారం సర్పంచ్ నడిగొట్ల రాజు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ సీతారాం మాట్లాడుతూ పట్టాల మార్పిడి కోసం, వంశపారపర్యంగా భూ పట్టా చేసుకొనేందుకు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూమి పట్టాలో పేర్లు సరిదిద్దుకోవచ్చని, వెబ్‌ల్యాండ్‌లో పేర్ల నమోదు తదతర సేవలను రెవెన్యూ గ్రామ సభల్లో పొందవచ్చన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులపై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామన్న , నాయకులు, విష్ణుమూర్తి, దారకొండ వీఆర్వో సత్యనారాయణ, దేవమణి తదితరులు పాల్గొన్నారు.